
చిన్నారులకు స్వచ్ఛత కిట్లు పంపిణీ చేస్తున్న రాంబాబు, వేణుగోపాల్ తదితరులు

విద్యార్థులకు స్వచ్ఛత కిట్లు పంపిణీ

సరూర్‌నగర్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా కేంద్ర రక్షణరంగ సంస్థ డీఆర్డీవో ఆధ్వర్యంలో బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ 29వ డివిజన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు ఉచితంగా స్వచ్ఛత కిట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ పెద్దబావి శోభాఆనంద్‌రెడ్డి హాజరై డీఆర్డీవో మిస్సైల్స్ విభాగం డీజీ యు.రాంబాబు, డీపీఎం ఆర్.వేణుగోపాల్‌తో కలిసి కిట్లు అందజేశారు. పిల్లలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ధనుంజయగౌడ్, డీఆర్డీవో ఏవో ఎం.బాలసుబ్రహ్మణ్యం, నాయకులు పి.నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, మణెమ్మ, రఘుపతి, యాదయ్య, మల్లేశ్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి: సీపీఎం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సిరెడ్డి

చంపాపేట, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్‌కార్డులు అందించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు కీసరి నర్సిరెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలో బుధవారం ప్రభాకర్ అధ్యక్షతన సీపీఎం చంపాపేటశాఖ మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సిరెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తీసుకొచ్చినట్లు అన్నారు. వారు తీసుకున్న 17లక్షల కోట్ల అప్పులను కేంద్రం మాఫీ చేసిందన్నారు. కార్మిక చట్టాలను మారు స్తూ 4లేబర్‌కోడ్స్‌ను కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చిందన్నారు. అనంతరం సీపీఎం చంపాపేట శాఖ నూతన కార్యదర్శిగా బి.దుర్గారావు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, నాయకులు రవీందర్‌యాదవ్, పి.రామస్వామి, గణేష్, ప్రభాకర్, కోటేశ్వర్‌రావు, గోపీ, నగేష్, యేసు, చిన్న, కోటేష్ పాల్గొన్నారు.

'బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వంద రోజుల పాటు చేపట్టే 'బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర' పోస్టర్‌ను అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆవిష్కరించారు. నాగోల్ డివిజన్ పరిధిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో చేపట్టే ఈ పాదయాత్ర ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి అచ్చంపేటలోని ఉమామహేశ్వరం దేవాలయం వరకు 1000 కిలోమీటర్లు 100 రోజుల పాటు కొనసాగుతుందని ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో బడే సాబ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫార్మా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ : రమాకాంత్


ఫార్మాసిస్టుల దినోత్సవం కార్యక్రమంలో సైంటిస్ట్ రమాకాంత్

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్ సైంటిస్ట్ డాక్టర్. రమాకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఫార్మా ప్రయోజనాలు, వాటి వల్ల కలిగే అవరోధాల గురించి విద్యార్థులకు వివరించారు. ఫార్మా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్. జయప్రద మాట్లాడుతూ వైద్య రంగంలో ఫార్మాసిస్టుల సేవలు మరువలేనివన్నారు. కాబోయే ఫార్మాసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్. బాలాజీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు భావన ఎంపిక



అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పెద్దఅంబర్‌పేట్‌లోని రాజశ్రీ విద్యామందిర్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పిట్టల భావన ఎంపికైంది. సెప్టెంబర్ 13 నుంచి 15 వరకు హౌసింగ్ బోర్డు ప్లేగ్రౌండ్‌లో జరిగిన 34 రాష్ట్రస్థాయి పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన భావన ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దీంతో సెలక్షన్ కమిటీ ఈనెల 28 నుంచి అక్టోబర్ 3 వరకు ఝార్ఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటున్నట్లు స్కూల్ చైర్మన్ సిద్దంకి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు మంజుల, కార్యదర్శి తోట జయప్రకాష్, కోశాధికారి ముత్యాల మహేందర్, స్కూల్ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, కోచ్ నీలేష్‌తో పాటు ఉపాధ్యాయ బృందం భావనను అభినందించారు.


బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

బర్ధన్ రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్ఎస్ఆర్‌కాలనీ ఫేజ్-2లోని సీపీఐ కార్యాలయంలో ఏబీ బర్ధన్ శత జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా బర్ధన్ చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, సమితి నాయకులు ముత్యాల యాదిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ, ఏఐటీయూసీకి బర్ధన్ చేసిన సేవలు మరువలేనివన్నారు. నేటి తరం యువత ఆయన రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, ప్రసాద్, నవనీత, నారాయణ, పుల్లయ్య, నారాయణరెడ్డి, భిక్షపతి, మధు, నిరంజన్, చందన, దేవమ్మ, గణేశ్ పాల్గొన్నారు.

ఎస్‌జేపీఐ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నరేష్‌నాయక్


నియామక పత్రాన్ని అందుకుంటున్న జాటావత్ నరేష్‌నాయక్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జటావత్ నరేష్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపు ఉత్తర్వులను ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ కేవీ గౌడ్ బుధవారం జారీ చేశారు. ఈ సందర్భంగా నరేష్‌నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కేవీ గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి వేముల కొండల్‌గౌడ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

పూలు, పండ్ల వ్యాపార సముదాయాల తొలగింపు


రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది


వనస్థలిపురం రైతుబజార్ వద్ద అధికారులు కూల్చివేసిన పూలు, పండ్ల వ్యాపార సముదాయాలు

వనస్థలిపురం, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం రైతు బజార్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న పూలు, పండ్ల వ్యాపార సముదాయాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్ మాట్లాడుతూ వనస్థలిపురం రైతుబజార్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా కొన్నేళ్లుగా రోడ్డును ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న పూలు, పండ్ల వ్యాపార సముదాయాలతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. పరిసర కాలనీవాసులు చేసిన ఫిర్యాదుల మేరకు మూడు రోజుల క్రితం వ్యాపారులకు సమాచారం అందించి బుధవారం వ్యాపార సముదాయాలను తొలగించామన్నారు. భవిష్యత్‌లో ఇక్కడ ఎవరైన వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పూలు, పండ్ల వ్యాపార సముదాయాలు తొలగించడంతో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోయినట్టేనని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కాగా కొన్నేళ్లుగా ఇక్కడ పూలు, పండ్ల వ్యాపారం చేసుకుని తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, హఠాహుటిన వచ్చి తమ వ్యాపార సముదాయాలను కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని పలువురు వ్యాపారులు వాపోయారు. ప్రభుత్వ అధికారులు తమ వ్యాపారాలు నిర్వహించుకోవడానికి మరో చోట స్థలం చూపించాలని, లేనిచో తమ కుటుంబాలు వీధిన పడే ప్రమాదం ఉందని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గట్టుమళ్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటికీ ఆగని కార్మికుల శ్రమ దోపిడీ : భూపాల్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్

హయత్‌నగర్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యాలు నేటికీ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూనే ఉన్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. బుధవారం రాగన్నగూడలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు పరిశ్రమలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, హమాలీ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. యాజమాన్యాలు కార్మిక చట్టాలను పాటించకుండా ఇష్టం ఉన్నట్లుగా వ్యవహరిస్తూ కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలను సవరించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అందివ్వాలని అన్నారు. ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కార్డులను ఉపసంహరించుకోవాలని, 8గంటల పని దినం అమలు చేయాలని, అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని అన్నారు. సెప్టెంబర్ 30న నగరంలోని లేబర్ కమిషనరేట్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, నాయకులు జగదీష్, స్వప్న, రాములు, ఎల్లేష్, చందునాయక్ పాల్గొన్నారు.

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యక్రమానికి ఆరాధన టీవీ ప్రతిభా పురస్కారం


నాగరాజుకు పురస్కారం అందజేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ న్యూస్‌చానల్ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమయ్యే ప్రత్యేక కార్యక్రమానికి ఆరాధన 30వ టీవీ ప్రతిభా పురస్కారం లభించింది. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమవుతున్న వ్యవసాయం ఎట్ ఆర్గానిక్ కార్యక్రమ రచయిత, నిర్మాత నాగరాజును సన్మానించి పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీలలో ప్రసారమవుతున్న కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, లంక లక్ష్మీనారాయణ, చిల్లా రాజశేఖరరెడ్డి, హనుమంతరావు, నిర్వాహకులు లోకం కృష్ణయ్య, నిర్మలాప్రభాకర్, రేణుకాప్రభాకర్, ఉమర్‌ఖాన్ పాల్గొన్నారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న కార్పొరేటర్ భిక్షపతిచారి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): మెగా మెంబర్‌షిప్ డ్రైవ్‌తో బీజేపీలో చేరుతున్న వారి సంఖ్య ఊహించని విధంగా పెరుగుతున్నదని, తద్వారా పార్టీ తన బలాన్ని సైతం పెంచుకుంటున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 9వ డివిజన్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం ఎంత పెరిగితే పార్టీ బలం అదే స్థాయిలో పెరుగుతుందని, దీనిపై ప్రతి కార్యకర్త ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ ఎన్.యాదగిరి, కార్పొరేటర్ సునీతాశ్రీకాంత్‌గౌడ్, పార్టీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, నాయకులు సంతోష్, మహేందర్, భాస్కర్, నర్సింగ్‌యాదవ్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో..

మెగా మెంబర్ షిప్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్ 27వ డివిజన్‌లోని కాలనీల్లో కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి చేత సభ్యత్వం చేయించి రసీదులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.భీమ్‌రాజ్, పార్టీ నాయకులు ఎర్రగడ్డ రమేశ్, మండల చందు, రామోజీ భాస్కర్‌చారి, నారోజు అశోక్‌చారి, దినేశ్‌కుమార్ పాల్గొన్నారు.

హోంగార్డు శస్త్ర చికిత్సకు ఉద్యోగుల సాయం

● చెక్కును అందించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు


ధరమ్‌సింగ్ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): సహోద్యోగి శస్త్ర చికిత్స కోసం విరాళాలు అందించిన హోంగార్డులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు. రాచకొండ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పి ధరమ్ సింగ్ హోంగార్డుగా విధు లు నిర్వహిస్తున్నాడు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ధరమ్‌సింగ్ ఆస్పత్రి లో చేరి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. తోటి ఉద్యోగికి సాయం చేసేందుకు ముందుకు వచ్చిన హోంగార్డులు రూ.2.25 లక్షలు సేకరించారు. కమిషనరేట్‌లో బుధవారం సీపీ సుధీర్‌బాబు ధరమ్‌సింగ్ కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం తమ తొలి ప్రాధాన్యమని అన్నారు.

పరికరాల పంపిణీ అర్హత పరీక్షకు విశేష స్పందన

వనస్థలిపురం, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీనివాసపురం కాలనీలోని శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో సోషల్ జస్టిస్ ఎంపవర్‌మెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత పరికరాల పంపిణీకి అర్హత పరీక్షకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు సీ.రమేష్ మాట్లాడుతూ మానసిక దివ్యాంగ విద్యార్థులు మానసికంగా దృఢంగా కావడం కోసం వారికి భారత ప్రభుత్వం ఉచితంగా పరికరాలైన వీల్‌చైర్లు, హియర్ మిషన్, ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు ఇతర పరికరాలను అందజేస్తుందన్నారు. అందుకు అర్హత సాధించడానికి తమ శాంతినికేతన్ మానసిక దివ్యాంగుల పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అర్హత పరీక్షకు పెద్ద సంఖ్యలో మానసిక దివ్యాంగులు హాజరు కావడం సంతోషకరం అన్నారు.

పీడీఎస్‌యూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షుడిగా సైదులు



చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షుడిగా మందుల సైదులను ఎన్నుకున్నారు. బుధవా రం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీయల్ మహిళ డిగ్రీ కళాశాలలో జరిగిన పీడీఎస్‌యూ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా సుమన్, సహాయ కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా వెంకటేష్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా ఉదయ్, మోహన్, శ్రీకాంత్‌తోపాటు మరో ఇద్దరిని కోఆప్షన్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా సైదులు మా ట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, హక్కుల సాధన కోసం పీడీఎస్‌యూ నిరంతరం ఉద్యమిస్తుందన్నారు.

పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబర్ 3వ తేదీన చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. చైర్మన్ స్వప్నపై మెజార్టీ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఆమెను చైర్మన్ పదవి నుంచి తొలగిస్తూ ఈనెల 23వ తేదీన ప్రభుత్వం గెజిట్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో మున్సిపల్ చైర్మన్ స్థానం ఖాళీ అయింది. దాంతో చైర్మన్ స్థానాన్ని భర్తీ చేయడానికి ఎన్నిక నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 3న ప్రత్యేక అధికారి సమక్షంలో ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

ఆగమ విద్యార్థుల

మార్గనిర్దేశకుడు రమాకాంతాచార్యులు

● త్రిదండి చిన జీయర్‌స్వామి


రమాకాంతాచార్యుల పరమపదోత్సవంలో మాట్లాడుతున్న త్రిదండి చిన జీయర్‌స్వామి

కొత్తపేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎందరో ఆగమ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన ఘనత సముద్రాల రమాకాంతాచార్యులకే దక్కుతుందని త్రిదండి చిన జీయర్‌స్వామి కొనియాడారు. ఆగమశాస్త్ర పండితుడు మద్యాధుల సముద్రాల రమాకాంతాచార్యులు(80) ఈనెల 13న నాగోల్‌లో తుదిశ్వాస విడిచారు. స్నేహపురి కాలనీలోని గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీనివాస మండపంలో బుధవారం సముద్రాల రమాకాంతాచార్యుల పరమపదోత్సవం ఘనంగా నిర్వహించారు. పరమపదోత్సవం త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సముద్రాల శ్రీమన్నారాయణాచార్యుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా వేదపండితుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా త్రిదండి చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ తమ ఆశ్రమాలలో ప్రధానంగా యజ్ఞయాగాది క్రతువులన్నీ రమాకాంతాచార్యులు చేశారన్నారు. 2000 సంవత్సరం కృష్ణా వసంతోత్సవాలకు వారే ప్రధాన యజ్ఞాచార్యులుగా ఉన్నారని జీయర్‌స్వామి గుర్తుచేశారు. రమాకాంతాచార్యులు శతాధిక దేవాలయాల ప్రతిష్ఠలు చేశారని పలువురు కొనియాడారు. స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రమాకాంతాచార్యులు స్థానాచార్యులుగా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో అహోబిల రామానుజ జీయర్, అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్, రామచంద్ర రామానుజ జీయర్ స్వాములు వివిధ ప్రాంతాల వేదపండితులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తీవ్రంగా కురుస్తున్నందున నగరంలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు తీవ్రంగా వ్యాపిస్తున్నాయని, సీజనల్ వ్యాధుల పట్ల గర్భిణులు చాలా అప్రమత్తత వహించాలని ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి గైనకాలజీ విభాగానికి చెందిన వైద్యులు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆస్పత్రిలోని ఇందిరా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా ఇంటి పరిసరాలతో పాటు స్వీయ శుభ్రత పాటించాలని, ద్రవ పదార్థాలను ఎక్కువ తీసుకోవాలని అన్నారు. గర్భందాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు గర్భిణులకు సీజనల్ వ్యాధులు వస్తే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే గైనకాలజీ వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో గైనకాలజీ విభాగ వైద్యులు బి.మేనక, ఎ.ప్రసన్నలత, అర్పన దినేష్ బిడ్డ, వాసవి పాల్గొన్నారు.

నవీకరించిన వాహనాలు రావడం అభినందనీయం


ఎంజీ విండ్సర్ ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆవిష్కరిస్తున్న నైనా జైస్వాల్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, ప్రజల అభిరుచుల మేరకు జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ద్వారా నవీకరించిన వాహనాలు రావడం అభినందనీయమని భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని పీపీఎస్ మోటార్స్ వేదికగా నూతనంగా ఆవిష్కరించిన ఎంజీ విండ్సర్ ఎలక్ట్రిక్ వాహనాన్ని బుధవా రం ఎంజీ మోటార్స్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్‌సింగ్ బజ్వాతో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీపీఎస్ మోటార్స్ ఎండీ రాజీవ్ సంఘ్వి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంగ్లి‌ష్‌లో 'బ్రెయిలీ' పాఠ్యపుస్తకాలు

● త్వరలో అందించనున్న అధికారులు


పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలు

ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : అంధ విద్యార్థుల పాఠ్యపుస్తకాల ముద్రణ ఇప్పటి వరకు తెలుగుభాషలోనే జరగగా, ఇప్పుడు ఆంగ్ల మాధ్యమంలో చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంధ విద్యార్థులకు కూడా ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా ఇంగ్లిష్‌లో బ్రెయిలీ లిపి పాఠ్యపుస్తకాల ముద్రణ చేపట్టారు. ఓల్డ్‌మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్‌లో పాఠ్యపుస్తకాల ముద్రణ కొనసాగింది. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ముద్రించిన పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. త్వరలో వీటిని విద్యార్థులకు అందించనున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇండెంట్‌తోపాటు విద్యార్థుల యూడీ ఐడీ కార్డులు జతచేసి పాఠ్యపుస్తకాలు తీసుకుపోవాలని బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణలో మహబూబ్‌నగర్, కరీంనగర్, హైదరాబాద్‌లో మూడుచోట్ల, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అంధ పాఠశాలలు కొనసాగుతున్నాయి.

ఘనంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి


దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల్లో అందెల

సరూర్‌నగర్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 9వ డివిజన్ పరిధిలోని రాగన్నగూడలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పండిట్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ నిమ్మల సునీతా శ్రీకాంత్‌గౌడ్, నాయకులు నడికుడ యాదగిరి, ఏనుగు రాంరెడ్డి, పెత్తుల్ల పుల్లారెడ్డి, అంజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాబాద్ : పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బుధవా రం కుర్మగూడలో నిర్వహించిన వేడుకల్లో బీజే పీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బండ వెంకట్‌రెడ్డి, నిరంజన్ యాదవ్, శ్రీనాథ్, ఉగాది మహేష్, జనపాల మధు, మోహనకృష్ణ, ప్రమోద్, సుధీర్ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్: బీజేపీకి బలమైన పునాదులు వేసిన దీక్షాదక్షుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని పార్టీ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మలక్‌పేటలో జరిగిన పండిత్ దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వంజరి వినోద్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి పటేల్ నవీన్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.


పండిట్ దీన్‌దయాల్‌కు నివాళులర్పిస్తున్న సహదేవ్‌యాదవ్

కుంట్లూర్ 143 సర్వే నంబర్‌లో 5 ఇళ్లు సీజ్

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ సర్వే నంబర్ 143లో నిర్మాణంలో ఉన్న 5 ఇళ్లను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. సదరు సర్వే నంబర్‌పై స్టేటస్-కో ఉన్న కొందరు ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. కాగా కోర్టు ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ బుధవారం సిబ్బందితో వెళ్లి 5 ఇళ్లను సీజ్ చేశారు. ఆ ఇళ్లను సీజ్ చేసినట్లు అక్కడ ఫ్లెక్సీలు కట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్ : ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని గుంతపల్లి గ్రామానికి చెందిన బరిగెల రాములమ్మ(67) గతంలో జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ కార్మికురాలిగా పని చేసిన ఆమె ప్రస్తుతం పూల వ్యాపారం చేస్తుంది. కాగా బుధవారం మధ్యాహ్నం గుంతపల్లికి వెళ్లేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ చౌరస్తాలో హయత్‌నగర్-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న క్రమంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో గమనించకుండా ఆమెను ఢీకొట్టారు. దాంతో కిందపడిన ఆమె కాళ్లపై నుంచి బస్సు టైర్లు వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఆమెను కామినేని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.